## క్లుప్తంగా

### ఘనంగా గ్రామదేవత సంబరాలు

భామిని: మండలంలోని నేరడి–బి గ్రామంలో వెలసిన రక్తపుట్టమ్మ గ్రామదేవత సంబరాలు బుధవారం ఘనంగా జరిగాయి. నేరడి–బి – బిల్లుమడ గ్రామాల మధ్య వెలసిన రక్తపుట్టమ్మ మందిరం వద్దకు గ్రామస్తులు మేళతాళాలతో ఊరేగింపు వెళ్లి సాంప్రదాయ మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు ముర్రాటలు ఇచ్చారు.

### బోర్లకు మరమ్మతులు



మండాకురిటిలో తాగునీటి బోరు బాగు చేస్తున్న మెకానిక్‌లు

సంతకవిటి : మండలంలోని మండాకురిటి గ్రామంలో తాగునీటి బోర్లకు బుధవారం మరమ్మతులు జరిపారు. క్రాష్ కార్యక్రమం ద్వారా వీటిని బాగు చేసినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సంతోష్‌కుమార్ వెల్లడించారు. మెకానిక్‌లు త్రినాధరావు, మన్మధరావు, సూర్యానారాయణ తదితరులు వీటిని మరమ్మతులు చేసి కొత్త భాగాలు ఏర్పాటు చేశారు.

### ఉపాధి పనుల పరిశీలన



ఉపాధి పనులను పరిశీలిస్తున్న జేఈ

జియ్యమ్మవలస: మండలంలోని గవరమ్మపేట పంచాయతీ గవరమ్మపేట, వెంకటరాజపురం గ్రామస్తులు గౌరీసాగరం చెరువులో చేస్తున్న ఉపాధి పనులను ఉపాధి హామీ జేఈ తేజేశ్వరరావు బుధవారం పరిశీలించారు. తప్పుడు మస్తర్లు నింపరాదని ,గ్రామం విడిచి వెళ్లిన వారి పేర్లు మస్తర్లలో ఉండరాదన్నారు. మేట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పర్యవేక్షణ ఉండాలన్నారు.

### నేటి మహా సంప్రోక్షణకు పకడ్బందీ బందోబస్తు



సిబ్బందికి సూచనలిస్తున్న డీఎస్పీ కృష్ణారావు

సీతంపేట: శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ మహా సంప్రోక్షణ కార్యక్రమానికి టీటీడీ చైర్మెన్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరవుతున్నందున పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు తెలిపారు. ఈ మేరకు పోలీసు సిబ్బందికి సీతంపేటలోని శ్రీవారి ఆలయం వద్ద పలు సూచనలు చేశారు. భక్తులు కూడా ఎక్కువ మంది వచ్చే అవకాశం ఉన్నందున వారికి ఎటువంటి ఆటంకం కలగకుండా చూడాలన్నారు. ట్రాఫిక్ లేకుండా క్లియరెన్స్ ఎప్పటికప్పుడు చేయాలని సూచించారు. పీఎంఆర్‌సీ వద్ద వాహనాలు పార్కింగ్ పెట్టుకోమని చెప్పాలన్నారు. కార్యక్రమంలో సీఐ మురళీధర్, ఎస్‌ఐ ఎ.నీలకంఠరావు పాల్గొన్నారు.

### ఎంసెట్‌లో సత్తా చాటాలి :పీఓ



ఎంసెట్ శిక్షణ తరగతులను పరిశీలిస్తున్న పీఓ కల్పనాకుమారి

సీతంపేట: ఎంసెట్‌లో మంచి ర్యాంకులు సాధించి సత్తా చాటాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి అన్నారు. స్థానిక గిరిజన గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థినిలకు ఇస్తున్న ఎంసెట్ కోచింగ్ సెంటర్‌ను బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు, అధ్యాపకులతో మాట్లాడారు. విద్యార్థినులు ఎటువంటి ఒత్తిడికి గురి కావద్దన్నారు. అర్థమయ్యే రీతిలో బోధించాలని అధ్యాపకులకు సూచించారు. అనంతరం బాలికల గురుకుల పాఠశాలను సందర్శించారు. మొదటి విడతలో జరిగిన నాడు – నేడు పనులు పరిశీలించారు. ఐటీఐ కళాశాలకు వెళ్లారు. సౌకర్యాలు అడిగి తెలుసుకున్నారు. కళాశాలలో విద్యుత్, నీటి సమస్య ఉందని పీఓ దృష్టికి సిబ్బంది తీసుకువచ్చారు. సీతంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించారు. విద్యార్థులకు సరైన మౌలిక వసతులు లేకపోవడంపై అసంతృప్తి చెందారు. మరుగుదొడ్లు బాగోలేవని, వసతిగృహంలో భోజనం బాగోలేదని విద్యార్థులు చెప్పారు. సమస్య పరిష్కరిస్తామని పీఓ హామీ ఇచ్చారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పి.సూర్యకుమారి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జీవనజ్యోతి, ఐటీఐ ప్రిన్సిపాల్ టీవీ గిరి తదితరులు పాల్గొన్నారు.

# శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్ఠ

- హాజరైన విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి
- పూజల్లో పాల్గొన్న టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి సతీమణి స్వర్ణలతా రెడ్డి, ఎమ్మెల్యే కళావతి



ప్రత్యేక పూజలకు హాజరైన టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి సతీమణి స్వర్ణలతా రెడ్డి, ఎమ్మెల్యే కళావతి



విగ్రహ ప్రతిష్ఠోత్సవంలో పాల్గొన్న స్వరూపానందేంద్ర సరస్వతి

సీతంపేట: సీతంపేటలో నూతనంగా నిర్మించిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో విగ్రహప్రష్ఠోత్సవం బుధవారం శాస్త్రోక్తంగా జరిగింది. విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, టీటీడీ చైర్మెన్ వై.వి.సుబ్బారెడ్డి సతీమణి స్వర్ణలతా రెడ్డి, పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ వేంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవారు, గోదాదేవి, గరుడాళ్వార్, ద్వారపాలకుల విగ్రహాలకు పవిత్ర జలంతో అభిషేకం చేశారు. యాగశాలలో వైదిక కార్యక్రమాలు, రత్నన్యాసం, ధాతున్యాసం, ఆలయానికి, రాజగోపురానికి విమానకలశస్థాపన, విగ్రహస్థాపన చేశారు. సాయంత్రం పూర్ణాహుతి, చతుర్దశ కలశస్నపనం, నవకలశస్నపనం, మహాశాంతి, యాగశాల వైదిక కార్యక్రమాలు, విశేషహోమాలు జరిపారు. గురువారం ఉదయం 7.30 నుంచి 8.30 వరకు వృషబలగ్నంలో మహాసంప్రోక్షణ, ఉదయం 10 గంటల నుంచి భక్తులకు స్వామివారి దర్శనం, సాయంత్రం 4 గంటలకు స్వామివారి కళ్యాణం నిర్వహించనున్నట్టు ఆలయ వర్గాలు తెలిపాయి. టీటీడీ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను అలరించాయి. పణుకువలస, గరుగుబిల్లి, లుంబూరు, పాలకొండకు చెందిన భజన బృందాలు భజనలు చేశాయి. పూజా కార్యక్రమాలను ఆలయ సూపరింటెండెంట్ చంద్రమౌళీశ్వర శర్మ, ఆగమ సలహాదారు మోహన్‌రంగాచార్యులు, శేషాచార్యులు, సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, వీజీఓ మనోహర్, డిప్యూటీ ఈఓలు గుణభూషణ్‌రెడ్డి , వెంకటయ్య, శివప్రసాద్ తదితరులు పర్యవేక్షించారు.

## బత్తిలిలో డ్రంక్ అండ్ డ్రైవ్

భామిని: మండలంలోని బత్తిలిలో ఎస్‌ఐ యతిరాజుల అమ్మనరావు ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులకు ఎస్‌ఐ పలు సూచనలు చేశారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. రహదారి భద్రత నిబంధనలు పాటించాలని కోరారు.

# సామాజిక తనిఖీలకు సన్నద్ధం



మాట్లాడుతున్న ఎస్ఆర్‌పీ గోవిందరావు

గరుగుబిల్లి: ఉపాధి హామీ పథకం నిధులతో నిర్వహించిన పనులపై తనిఖీలు నిర్వహించేందుకు సామాజిక బృందాలు సన్నద్ధమవుతున్నాయి. ఎంపీడీఓ కార్యాలయంలో సామాజిక తనిఖీలపై రికార్డులు సిద్ధం చేయడంపై సిబ్బందికి బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఆర్‌పీ ఎం.గోవిందరావు, ఎం.తిరుపతిరావు మాట్లాడుతూ 2022 – 23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మండల పరిధిలో రూ.13.69 కోట్ల పనులు చేపట్టారు. ఈ నిధులతో చేపట్టిన 519 పనులపై 11మంది డీఆర్‌పీలు నియమించడం జరిగిందన్నారు. ఈ నెల 15లోగా క్షేత్ర స్థాయిలో పనుల నిర్వాహణ, నిధులు విడుదల తదితర అంశాలపై తనిఖీలు చేయడం జరుగుతుందన్నారు. సామాజిక తనిఖీలకు గ్రామాలలో వేతనదారులు సహకరించాలన్నారు. ఏపీఓ టి.రామకృష్ణనాయుడు తదితరులున్నారు.

# రెండు పూటలా పని చేయాలి



జంఝావతి కెనాల్ వద్ద జరుగుతున్న పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కొమరాడ: ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న వేతనదారులు రెండు పూటలా కచ్చితంగా పని చేయాలని ఎంపీడీఓ ఎల్‌వీ అప్పారావు అన్నారు. గంగారేగువలస పరిసరాల్లో జంఝావతి కెనాల్‌లో పని చేస్తున్న వేతనదారుల మస్తర్లను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొలతల ప్రకారం పని చేసి తగిన వేతనం పొందాలన్నారు. పని ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలు సమకూర్చాలన్నారు. ఆయన వెంట క్షేత్ర సహాయకులు ఉన్నారు.

# వేంకటేశ్వరుని కల్యాణానికి తరలిరండి



భామినిలో టీటీడీ ప్రచార రథం

భామిని: మండలంలో హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఆధ్వర్యంలో శ్రీవేంకటేశ్వరుని కల్యాణానికి తరలి రావాలని శ్రీవారి లగ్న పత్రికలను భక్తులకు బుధవారం అందజేసి ఆహ్వానించారు. సీతంపేటలో టీటీడీ ఆధ్వర్యంలో నిర్మించిన శ్రీవేంకటేశ్వరుని దర్శించుకోవాలని, 4వ తేదీన నిర్వహించే కల్యాణంలో పాల్గొని తరలించాలని కోరారు. టీటీడీ ప్రచార రథం ద్వారా బత్తిలి, గురండి, సింగిడి, భామిని, బాలేరు, పెద్దదిమిలి, ఘనసర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో హిందూ ధర్మ ప్రచార పరిషత్తు సూపరింటెంటెండ్ చంద్రమౌళీశ్వర శర్మ, ప్రొగ్రాం ఆఫీసర్లు శ్యాంసుందర్, లలితామణి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఉద్యోగ విజయోత్సవం



ఉద్యోగ నియామక పత్రాలతో ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, అధ్యాపక సిబ్బంది

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి కళాశాల విద్యార్థులు ఉద్యోగ ప్రభంజనం సృష్టించారు. 10 మంది మెకానికల్ విద్యార్థులు రూ.1.80 లక్షల ప్యాకేజీకి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎల్.విజయలక్ష్మి తెలిపారు. బుధవారం ఉద్యోగ విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. చినమేరంగి పాలిటెక్నికల్ కళాశాలలో చదివిన విద్యార్థులు చిన్న వయస్సులోనే ఉద్యోగం సంపాదించడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదివితే ఎంతటి వాటినైనా సాధించవచ్చన్నారు. ఉద్యోగ హామీ పత్రాలను మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు, సర్పంచ్ అల్లు రవణమ్మ, ఎంపీటీసీ మజ్జి అన్నపూర్ణమ్మ చేతులమీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

# వేతనదారుల సంఖ్యను పెంచండి



ఉపాధి సిబ్బందితో మాట్లాడుతున్న డీఎల్‌డీఓ గోపాలకృష్ణ

వీరఘట్టం: ఉపాధి హామీ పనుల్లో వేతనదారుల సంఖ్యను పెంచాలని డివిజినల్ డవలప్‌మెంట్ అధికారి వి.గోపాలకృష్ణ సూచించారు. స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో బుధవారం ఆయన ఉపాధి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. వేతనదారులకు గరిష్ట వేతనం వచ్చేలా పనులు చూపించాలన్నారు. చేసిన పనులకు సక్రమంగా కొలతలు వేయాలని టెక్నికల్ అసిస్టెంట్లకు సూచించారు. సమీక్షలో ఎంపీడీఓ వై.వెంకటరమణ, ఏపీఓ జి.సత్యంనాయుడు పాల్గొన్నారు.

# కనుల పండువగా అమ్మవారి తిరువీధి

- ఘటంతో తిరువీధి ఉత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కళావతి



అమ్మవారి ఘటంతో తిరువీధి ఉత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: ఏడేళ్ల తర్వాత వచ్చిన వీరఘట్టం గ్రామదేవత పైడితల్లి అమ్మవారి మహోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అమ్మవారి ఘటాన్ని తలపై పెట్టుకుని తిరువీధి ఉత్సవంలో పాల్గొన్నారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. ఉదయం అమ్మవారి పాలజంగిడితో బోయిడు తూర్పుగా బయలుదేరి ప్రధాన రహదారి గుండా చేరుకున్నాడు. అక్కడ నుండి ఆంజనేయ కాలనీ, బంగ్లా కాలనీ, బీసీ కాలనీ, రెల్లివీధి, గొల్లవీధిల గుండా పాలజంగిడి ఊరేగించారు. భక్తులు బోయిడు పాదాలకు పూజలు చేశారు. అనంతరం సాయంత్రం అమ్మవారి ఘటాలు ఇవే వీధుల్లో తిరిగాయి. పెద్దసంఖ్యలో మహిళలు ఈ ఘటాలను మోసేందుకు పోటీపడ్డారు. అన్ని వీధుల గుండా తిరిగిన ఘటాలు చివరకు అమ్మవారి ఆలయానికి చేరుకోవడంతో మొదటి రోజు ఘటాల మహోత్సవం ముగిసింది. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

### 5, 6 తేదీల్లో గడప గడపకు మన ప్రభుత్వం

కురుపాం: మండలంలోని నీలకంఠాపురం, ధర్మలక్ష్మీపురం గ్రామాల్లో ఈ నెల 5, 6 తేదీల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల కనీ్వనర్ ఇంటికుప్ప ల గౌరీశంకరరావు, సర్పంచ్ అడ్డాకుల మన్మధరావు బుధవారం తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి పాల్గొంటారని పేర్కొన్నారు. 5వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుంచి నీలకంఠాపురంలో, 6వ తేదీ ఉదయం 9 గంటల నుంచి ధర్మలక్ష్మీపురంలో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు.

### భక్తిశ్రద్ధలతో సీతారాముని కల్యాణం



శ్రీకోదండ రామాలయంలో స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

గరుగుబిల్లి: తోటపల్లి శ్రీ కోదండరామస్వామి ఆలయంలో శ్రీ సీతారామస్వామివారి వార్షిక కల్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బుధవారం ఉదయం అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకులకు సుప్రభాతసేవ, ఆరాధన, మంగళాశాసనం, విశ్వక్షేణపూజ, పుణ్యహవాచనం, రుత్విక్‌వరుణ, మృత్యంగ్రహణం, అంకురారోపణం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు వీవీ అప్పలాచార్యులచే శ్రీసీతారామ స్వామి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి అధికంగా దంపతులు పాల్గొని స్వామివారి కళ్యాణాన్ని జరిపించారు. స్వామివారికి, అమ్మవారికి ఉత్సవమూర్తులకు అర్చక స్వాములకు దీక్షా వస్త్ములను, పూజా సామగ్రిని దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లును నిర్వహించినట్లు ఆలయ సిబ్బంది తెలిపారు.

### పాడి రైతులు జాగ్రత్తలు పాటించాలి

సీతానగరం: దూడల మరణాల నివారణకు పాడి రైతులు జాగ్రత్తలు పాటించాలని పశుసంవర్ధక శాఖ ఎ.డి డాక్టర్ సీహెచ్ దీనకుమార్ సూచించారు. ఈ మేరకు బుధవారం ఆయన మండల పశువైద్య కార్యాలయం (పెదభోగిలి ఆర్బీకే)లో పాడి రైతులకు దూడల మరణాలు నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై పశువిజ్ఞానబడి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆధునిక పద్ధతుల ద్వారా మేలైన పశుసంపదను అభివృద్ధి చేసి వాటి సంరక్షణ, నాణ్యమైన పశు ఉత్పత్తులు పెంచడానికి రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. లేగదూడలు మరణాల శాతాన్ని ఏవిధంగా తగ్గించ వచ్చో సదస్సులో వివరించారు.

### సంక్షేమ క్యాలెండర్ ఆవిష్కరణ

పార్వతీపురంటౌన్: రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్న పథకాల సంక్షేమ క్యాలెండర్‌ను మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు ఆవిష్కరించారు. ఈ మేరకు బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో క్యాలెండర్లను సచివాలయ సిబ్బందికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల కార్యక్రమంలో భాగంగా వివిధ సంక్షేమ పథకాలు ఏ నెలలో విడుదలవుతాయో క్యాలెండర్ తెలియజేస్తుందన్నారు. సచివాలయ సిబ్బంది విధిగా వార్డు సచివాలయాల్లో ఈ క్యాలెండర్‌ను నోటీసు బోర్డులో ప్రదర్శించాలని స్పష్టం చేశారు. ఏనెలలో ఏ పథకం వస్తుందో వలంటీర్లకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### కామాక్షమ్మకు కుంకుమ పూజ

సాలూరు: పట్టణంలో కామాక్షమ్మ ఆలయం వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని అమ్మవారికి కుంకుమార్చన చేశారు.

## ఆత్మీయ స్వాగతం



ఎ.రావివలస హెలిప్యాడ్ వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు దంపతులు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ తదితరులు

## నాడు - నేడు పనులను పరిశీలించిన డీవీఈఓ



ఇంటర్ ప్రత్యేక తరగతులను పరిశీలిస్తున్న డీవీఈఓ మంజులవేణి

భామిని: పార్వతీపురం మన్యం జిల్లా డీవీఈఓ మంజులవేణి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం సందర్శించారు. నాడు – నేడు పనులను పరిశీలించారు. ఇంటర్ ఫలితాలపై ఆరా తీశారు. ఇంటర్ విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను పరిశీలించారు. నాడు – నేడు కింద జరుగుతున్న పనుల్లో భాగంగా మినరల్ వాటర్ ప్లాంట్ రూం, మరుగుదొడ్ల వాటర్ ట్యాంకు ఏర్పాట్లును చూశారు. కళాశాల తెరిచే సరికి పనులు పూర్తి చేయాలని సూచించారు. ఆమె వెంట ప్రిన్సిపాల్ వై.ఎర్రంనాయుడు తదితరులు ఉన్నారు.

## సారా స్థావరాలపై దాడి



స్వాధీనం చేసుకున్న సారాను చూపుతున్న సీఐ సత్యనారాయణ

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎల్విన్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో అక్రమంగా నిర్వహిస్తున్న సారా స్థావరాలపై ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ షన్ముఖరావు తమ సిబ్బందితో కలిసి బుధవారం దాడులు నిర్వహించారు. దాడుల్లో ఇరువురు వ్యక్తులను అదుపులోకి తీసుకోవడంతో పాటు 30 లీటర్ల సారాను స్వాధీనపర్చుకున్నట్లు తెలిపారు. ఇరువురు వ్యక్తులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. సారా తయారు చేసినా, విక్రయించినా, రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కురుపాం: మండలంలోని గుమ్మ, కాకితాడ గిరిజన గ్రామ పరిసరాల్లో ముందస్తు సమాచారం మేరకు ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ షణ్ముఖరావు బుధవారం దాడులు చేసి 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. దాడుల్లో ఏపీఎస్పీ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఆక్రమణల తొలగింపు

- సాక్షి ఎఫెక్ట్



ఆక్రమణలో ఉన్న స్థలం పరిశీలిస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ తదితరులు

పాలకొండ: పట్టణంలోని నాగవంశపు వీధి సమీపంలో ఉన్న డీసీఎంఎస్ స్థలంలో ఆక్రమణలు బుధవారం తొలగించారు. స్థలంలో అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని ఇటీవల సాక్షిలో కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. డీసీఎంఎస్ చైర్మన్ దేవరాజ్ స్థలం పరిశీలించారు. స్థలంలో సర్వే చేపట్టి ఆక్రమణలు జరిగినట్లు గుర్తించారు. ఈ సందర్భంగా దేవరాజ్ మాట్లాడుతూ అత్యంత విలువైన స్థలం ఆక్రమణలు జరిగినట్లు గుర్తించామని తెలిపారు. ప్రస్తుతం సర్వే పూర్తి చేసి ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఆయనతో పాటు వార్డు కౌన్సిలరు ప్రతినిధి పల్లా భాను ఉన్నారు.

## పనితీరు మారకుంటే చర్యలు



సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ

పాలకొండ: పనితీరు మారకపోతే చర్యలు తప్పవని డీఎల్‌డీఓ వీవీ గోపాలకృష్ణ సచివాలయ సిబ్బందిని హెచ్చరించారు. మండలంలోని తుమరాడ సచివాలయాన్ని ఆయన బుధవారం సందర్శించారు. ఈ సమయంలో 10 మంది సిబ్బందికిగాను ముగ్గురు మాత్రమే విధుల్లో ఉండడంపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. మిగతా సిబ్బంది కోసం ప్రశ్నిస్తే సెలవులో ఉన్నారని తెలపడంతో ఆయన అంతమంది ఒకే రోజు సెలవు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వం ఉన్నత ఆశయంతో సచివాలయాను ఏర్పాటు చేసిందన్నారు.

# వేతనదారులతో సమావేశం



వెలగవాడలో ఉపాధి వేతనదారులతో సమావేశమైన ఎంపీడీఓ త్రినాథులు

పాలకొండ రూరల్: మండలంలోని వెలగవాడ గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ డొంక త్రినాధులు బుధవారం పరిశీలించారు. పనులకు హాజరైన వేతనదారులతో సమావేశం నిర్వహించారు. సగటున రోజుకు అందుతున్న వేతనం, పనులు చేపడుతున్న చోట అందుబాట్లో ఉన్న సౌకర్యాలు, హాజరు నమోదు తదితర అంశాలపై చర్చించారు. అనంతరం గోపాలపురం గ్రామంలో కొత్తగెడ్డలో జరుగుతున్న ఉపాధి పనులు పరిశీలించారు. క్షేత్ర స్థాయి సిబ్బంది పనులు జరిగే చోట కచ్చితంగా ఉండాలన్నారు. మస్తర్లు సక్రమంగా వేయాలని, సగటున వేతనం రూ.275 వచ్చేలా కృషి చేయాలన్నారు.

## సచివాలయాన్ని సందర్శించిన ఎంపీడీఓ



అల్లువాడలోని సబ్‌సెంటర్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రమేష్

జియ్యమ్మవలస: మండలంలోని అల్లువాడ సచివాలయం, హెల్త్ సెంటర్‌ను ఎంపీడీఓ ఎస్.రమేష్ బుధవారం సందర్శించారు. సచివాలయంలోని రికార్డులు పరిశీలించారు. ఈ సర్వీస్‌లో భాగంగా 1809 పెండింగ్‌లో ఉన్నాయని గుర్తించారు. వాటిని చలానా జనరేట్ చేయాలన్నారు. అంగన్‌వాడీ సెంటర్‌లో పిల్లల హాజరు, స్టాక్ పరిశీలించారు. సబ్ సెంటర్‌లో ఓపీ రిజిస్టర్‌ను చూడగా 8 మంది ఆరోగ్య పరీక్షలు చేసుకున్నారని తెలిపారు.